

## దిగిరాని సర్కారు.. మాత్రలిచ్చే దిక్కులేరు

జిల్లాలో గత 11 రోజులుగా సీహెచ్‌ఓలు సమ్మెబాట పట్టారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడ్డాయి. - 12లో..



## దూసుకొచ్చిన మృత్యువు

స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో అయిన బైక్‌ను టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చి ఢీకొనడంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. - 12లో..

## వాతావరణం

గరిష్టం/కనిష్టం 39 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### పద్మ అవార్డులకు నామినేషన్ల ఆహ్వానం

**ఒంగోలు సబర్బన్:** భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీ జాతీయ స్థాయిలో అందజేసే పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేస్తారన్నారు. అందులో భాగంగా కళారంగం, విద్య, సాహితీ రంగం, క్రీడా రంగం, వైద్యం, సామాజికసేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు, తయారీ, సేవా రంగం తదితర రంగాల్లో ఉత్తమ సేవలు, ప్రతిభ కనబరిచే కార్యక్రమాలు చేపట్టిన వారికి పద్మ అవార్డులు భారత ప్రభుత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఏడీఎంఏఏడబ్ల్యూఏఆర్ డీఎస్.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు, ఇతర వివరాలను జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్ప్ ఒంగోలు కార్యాలయంలో ధ్రువపత్రాలతో మూడు కాపీలు సమర్పించాలన్నారు. ఇతర వివరాల కోసం కార్యాలయ పనివేళల్లో స్వయంగా కానీ లేదా ఫోన్ నంబర్ 91828 91095 ద్వారా తెలుసుకోవాలని కలెక్టర్ కోరారు.

### ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

సాక్షి ఎఫెక్ట్..

**మార్కాపురం:** ఆర్టీసీ బస్టాండుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చే ప్రయాణికులకు కనీస సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్టీసీ డీపీటీఓ (ఆర్ఎంఓ) జీ సత్యనారాయణ స్థానిక డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులుకు తెలిపారు. శుక్రవారం మార్కాపురం ఆర్టీసీ బస్టాండు, డిపో, కార్గో సర్వీసులను పరిశీలించారు. ఈ సందర్భంగా గత నెల 27న 'సాక్షి'లో ప్రచురితమైన 'చక్ర బంధం' కథనంపై సమాచారం తెప్పించుకున్నారు. ప్రయాణీకుల నమ్మకాన్ని కోల్పోకుండా సౌకర్యాలు కల్పించాలని, నమ్మకాన్ని పెంచుకోవాలని, ప్రయాణికులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. బస్టాండుల్లో తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని అన్నారు. బాత్‌రూమ్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్గో ఆదాయంపై దృష్టి సారించాలని, కార్గో సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అనంతరం గ్యారేజీకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించి కండీషన్‌లో బస్సులను బయటకు పంపాలని చెప్పారు.

### పాఠశాల లాగిన్‌లో మార్కుల జాబితాలు

**ఒంగోలు సిటీ:** మార్చి-2025 లో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన మార్కుల జాబితాలను ఈ నెల 8వ తేదీ నుంచి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని హెచ్ఎం సంతకంతో విద్యార్థులకు అందజేయాలని డీఈఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మార్కుల జాబితాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మార్కుల జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే పాఠశాలలో ఉన్న అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం పరిశీలించి అడ్మిషన్ రిజిస్టర్ నకలు, మార్కుల మెమోను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించి ఈ నెల 25వ తేదీలోపు డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్, ఏపీ, విజయవాడ వారికి పంపాల్సిందిగా కోరారు.



భరతమాత ముద్దు బిడ్డల నుదుటి సిందూరం తుడిచేసిన శత్రుమూకల భరతం పట్టేందుకు జిల్లాలోని సైనికులను వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వీరతిలకం దిద్ది యుద్ధానికి సాగనంపుతున్నారు. విజయీభవ అంటూ ఆశీర్వదిస్తున్నారు. పహల్గాంలో ముష్కరులు పర్యాటకులను అతిదారుణంగా చంపడంతో భారత్–పాకిస్థాన్ మధ్య యుద్ధం అనివార్యమైంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో వేట ప్రారంభించిన నేపథ్యంలో సెలవులకు వచ్చిన సైనికులు తమ బేస్ క్యాంప్‌లకు పయనమవుతున్నారు. కన్నవాళ్లని, కట్టుకున్న భార్యని, కడుపున పుట్టిన వాళ్లకు వీడ్కోలు పలికారు మన జవానులు. కోట్లాది మంది భారతీయులకు రక్షణగా నిలిచే భాగ్యం దక్కిందని గర్వంగా మురిసిపోతున్నాయి సైనిక కుటుంబాలు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ ప్రతీకారం తీర్చుకోవడం ఆనందంగా ఉందని, మాకు అవకాశం ఇస్తే సిద్ధంగా ఉన్నామంటున్నారు మాజీ సైనికులు.

# ఎక్కుపెట్టిన దేశభక్తి

సాక్షి ఫోకస్

- సిందూర్ 2.0కి పయనమైన పశ్చిమ వీరులు
- వీర తిలకం దిద్ది శత్రువుల భరతం పట్టమని తల్లిదండ్రుల ఆశీర్వచనాలు
- మేము సైతం యుద్ధంలో పాల్గొంటామంటున్న మాజీలు
- సైన్యంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 15 వేల మంది జిల్లా వాసులు
- ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే 8 వేలకు పైగా..



ఆపరేషన్ సిందూర్ విజయ సూచిక చూపిస్తున్న మాజీ సైనికులు

**కంభం:** దేశ రక్షకులు సైనికులు.. శత్రువులను మన భూభాగంలోకి రానీయకుండా కొండాకోనల్లో, మంచు పర్వతాల్లో, దట్టమైన అడవుల్లో, సముద్ర తీరాల్లో, గగనతలంలో 24 గంటలూ కాపలా కాస్తూ దేశ ప్రజలను కాపాడుతున్నారు. యుద్ధరంగంలో శత్రుమూకల భరతం పట్టేందుకు జిల్లా సైనికులు ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటారు. పహల్గాంలో ముష్కరులు పర్యాటకులను అతిదారుణంగా చంపిన నేపథ్యంలో భారత్- పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం ప్రారంభమైంది. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఇప్పటికే భారత సైన్యం ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసింది. తర్వాత పాక్ కవ్వింపు చర్యలకు దిగింది. వాటికి భారత్ దీటుగా బదులిస్తోంది. భారత్–పాక్ సరిహద్దులో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. భారత ఆర్మీ తన బలగాలకు సెలవులు రద్దు చేసింది. సెలవులపై సొంతూళ్లకు వచ్చిన జవాన్లు కదన రంగానికి మేము సైతం అంటూ బయలుదేరారు.

**ముందు వరుసలో పశ్చిమ ప్రకాశం:**

జిల్లాలో సుమారు 15 వేల మంది సైనికులు భారత ఆర్మీలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అందులో పశ్చిమ ప్రకాశంలోని గిద్దలూరు నియోజకవర్గం నుంచే సుమారు 8 వేల మంది సైనికులు ఉన్నారు. గతంలో జరిగిన పలు యుద్ధాల్లో పాల్గొన్న పలువురు జిల్లా వాసులు వీరమరణం పొందిన చరిత్ర ఉంది. అయినా మొక్కవోని ధైర్యంతో తామంతా దేశం కోసం పనిచేసేందుకు ముందు వరుసలో ఉంటామని చెబుతూ ధైర్యంగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ద్వారా ఎంతో మంది యువకులు సైన్యంలో చేరి దేశ సేవలో భాగస్వాములవుతున్నారు. మొదటి, రెండో ప్రపంచ యుద్ధంలో ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది పాల్గొన్నారు. ఆ తర్వాతా వారి కుటుంబ సభ్యులు అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ సైన్యంలో చేరుతూ వస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పదిశాతం మంది ఆర్మీలో విధులు నిర్వహిస్తుండగా అర్ధవీడు, కొమరోలు, రాచర్ల, కంభం మండలాల్లోని పలు గ్రామాల్లో ఇంటికొక ఆర్మీ జవాన్ ఉన్నారు.

**సైనికులు తిరుగు ప్రయాణం:**

ఇటీవల సెలవులపై ఇంటికి వచ్చిన సైనికులు భారత్–పాక్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తిరుగు ప్రయాణాలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు వెళ్లిపోగా మిగిలిన వారు వారికి అందిన ఆదేశాల ప్రకారం వారి స్థావరాలకు చేరుకుంటున్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆర్మీ జవాన్లను ఆశీర్వదించి కదనరంగంలో విజయం సాధించి శత్రువుల భరతం పట్టాలని ఆశీర్వదించి పంపిస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో సుమారు 100 మందికి పైగా సైనికులు ప్రస్తుతం సెలవుల్లో రాగా కొందరి సెలవులు పూర్తయి తిరుగు ప్రయాణమయ్యారు. సుమారు 30 సైనికులకు వారి సెలవు కాలం ఉన్నప్పటికీ అధికారుల నుంచి రీకాల్ రావడంతో కార్యక్షేత్రాలకు బయలుదేరారు. దేశ భద్రతకు తమ కుటుంబం త్యాగం చేస్తోందని గుండె నిబ్బరం గా ఉన్నాయా కుటుంబాలు.

**మేము సైతం సిద్ధమంటున్న మాజీ సైనికులు**

ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని. ప్రభుత్వం ఆదేశిస్తే కదనరంగంలో కాలు దువ్వడానికి సిద్ధంగా ఉన్నామని నియోజకవర్గంలోని మాజీ సైనికులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆర్మీ అధికారులకు పూర్తి స్వేచ్ఛ నివ్వడం శుభపరిణామమని, ఈ సారి ఉగ్రవాద సంస్థలు పూర్తి స్థాయిలో ధ్వంసం చేసే సత్తా భారత సైన్యానికి ఉందన్నారు. పాక్ కవ్వింపులను తిప్పికొడుతతూ భారత త్రివిధ దళాలు దూసుకుపోతుండడంపై మాజీ సైనికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ధైర్యంగా ఉండమని చెప్పాడు



నా కొడుకు 18 సంవత్సరాలుగా ఆర్మీలో పని చేస్తున్నాడు. భారత్–పాకిస్థాన్ మధ్య జరుగుతున్న దేశం కోసం పోరాటం చేస్తున్నామని విజయం సాధిస్తామన్నాడు. భయపడాల్సిన పనిలేదని ధైర్యంగా ఉండమని నాకొడుకు చెప్పాడు.

– ఎస్.లక్ష్మీ దేవి, అర్ధవీడు మండలం

### శత్రువులకు ఓటమి తప్పదు



భారత సైన్యానికి ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనివ్వడంతో ఈ సారి దీర్ఘకాలికంగా కొనసాగుతున్న భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలకు పరిష్కారం లభించనుంది. భారత సైన్యం పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద సంస్థలను ధ్వంసం చేసి వారికి మద్దతిస్తున్న పాకిస్తాన్‌కు సరైన గుణపాఠం నేర్పించనుంది. శత్రువులకు ఓటమి తప్పదు.

– ఎస్‌ఎం బాష, రిటైర్డ్ సుబేదార్, కంభం

### సిందూర్‌తో ఉగ్రవాదుల పని ఖతం



నలభై ఏళ్లుగా భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ఈసారి ముగింపు రానుంది. ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే భారత సైన్యం శక్తి ఏమిటో శత్రుదేశానికి అర్థమై ఉంటుంది. పాకిస్థాన్ వారి దేశంలో ఉన్న ఉగ్రవాదుల్ని తీసుకొచ్చి భారత్‌కు అప్పగించాలి. లేని పక్షంలో వారు ఎక్కడ దాక్కొని ఉన్నా భారతసైన్యం వదిలిపెట్టదు.

– శెట్టెం వేణుగోపాల్ రావు, రిటైర్డ్ సుబేదార్, కంభం

### 15 రోజుల సెలవు ఉండగానే..



నాభర్త ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల సెలవు తీసుకొని ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి 15 రోజులైంది. సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నేపథ్యంలో ఆయనకు రీకాల్ రావడంతో ఇంకా పదిహేను రోజులు సెలవు ఉండగానే రెండు రోజుల కిందట బయలు దేరి వెళ్లిపోయారు.

– జి.శేషమ్మ, సైనికుడి సతీమణి, కంభం

### సేవలందించేందుకు సిద్ధం



నేను 18 సంవత్సరాలు ఆర్మీలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యాను. ఆపరేషన్ సిందూర్ పేరుతో ముష్కరులపైన, పాకిస్తాన్‌పై చేస్తున్న యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నాం. కేంద్ర ప్రభుత్వం మాజీ సైనికులను ఆహ్వానిస్తే సైన్యంలో చేరి శత్రుదేశానికి బుద్ధి చెపుతాం.

– సంకతాల ప్రసాద్, మాజీ సైనికుడు, కంభం

### నా ఇద్దరు పిల్లలు సరిహద్దుల్లో ఉన్నారు



నా భర్త ఆర్మీలో సుమారు పదేళ్ల విధులు నిర్వహించి అనారోగ్యంతో బయటకు వచ్చారు. నాకు ఇద్దరు కవల పిల్లలు. వారిద్దరూ ఆర్మీలో ఉద్యోగం నిర్వహిస్తూ సరిహద్దుల్లో ఉన్నారు. మా ఇద్దరు పిల్లలు దేశం కోసం పని చేస్తుండడం గర్వంగా ఉంది. కదనరంగంలో మనసైనికులు కచ్చితంగా విజయం సాధిస్తారన్న నమ్మకం ఉంది.

– పి.జయలక్ష్మి, పోరుమామిళ్లపల్లి

### దేశం కోసం పనిచేయడం గర్వంగా ఉంది



ఆర్మీలో ఉద్యోగం చేస్తూ దేశం కోసం పని చేయడం గర్వంగా ఉంది. గతంలో మా నాన్న ఆర్మీలో పనిచేశారు. ప్రస్తుతం నేను, నా సోదరుడు గత 13 ఏళ్లుగా ఆర్మీలో పనిచేస్తున్నాం. దేశంలో సరిహద్దులో పహారా కాయడం భారత పౌరుడిగా, ఆర్మీ జవాన్‌గా మా బాధ్యతగా భావిస్తున్నాను.

– సాయి వెంకటేశ్వర్, హవల్దార్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## వీరయ్య కేసు ముగింపు ఎప్పుడు ?

**ఒంగోలు టౌన్:** మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరిగి నేటికి 19 రోజులైంది. గురువారం ఆయన స్వగ్రామం అమ్మనబ్రోలులో పెద కర్మ కూడా నిర్వహించారు. అయితే ఇప్పటి వరకు కేసు ఎటూ తేలలేదు. హత్య కేసులో ఇప్పటి వరకు సుమారు 200 మందికి పైగా అనుమానితులను తీసుకొచ్చి విచారించారు. కీలకమైన ఆధారాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. మొత్తం మీద వీరయ్య చౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారులను, పాత్రధారులను పట్టుకొచ్చారు. మరో అనుమానితుడిని అదుపులోకి తీసుకునేందుకు గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. తొలుత వీరయ్య చౌదరి పెదకర్మ లోపలే ఏదో ఒకటి తేల్చేస్తారని ప్రచారం జరిగింది. ఒకవేళ పెదకర్మ రోజున ఏదైనా ఘటనలు జరిగుతాయేమోననే అనుమానంతో దాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. ఇప్పుడు ఆ పని కూడా అయిపోవడంతో వీరయ్య చౌదరి హత్య కేసు ముగింపు కోసం జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు...**

యుద్ధ వాతావరణం నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడే లక్ష్యంతో జిల్లాలో పోలీసుల తనిఖీలు కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసు స్టేషన్ల ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండులు, రైల్వే స్టేషన్లు, సరిహద్దుల వద్ద ఉన్న చెక్ పోస్టుల వద్ద కూడా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలు, మోటరు బైకులను ఆపి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. వాహనాల తనిఖీలతో పాటుగా ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. రైల్వే స్టేషన్లు, బస్టాండులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ఏదైనా అనుమానాస్పద బ్యాగులు, వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు కానీ డయల్ 112 కు కానీ ఫోన్ చేయాల్సిందిగా ఎస్పీ ఏఆర్ దామోదర్ విజ్ఞప్తి చేశారు.

## కక్ష సాధింపులు సమాజానికి నష్టం

- నెహ్రూ యువకేంద్రం రిటైర్డ్ జాయింట్ డైరక్టర్ నాగిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



చంద్రమోహన్‌రెడ్డి

**ఒంగోలు టౌన్:** కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న చంద్రబాబు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి కక్ష సాధింపులతో దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ప్రజా సంఘాలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేశం మొత్తం యుద్ధ వాతావరణం నెలకొని ఉన్న తరుణంలో ప్రజలకు ధైర్యం నూరిపోయాల్సిన పాలకులు బాధ్యతారాహిత్యంగా వ్యక్తగత కక్షలతో సాధింపులకు దిగడంపై మేధావి వర్గం మండిపడుతోంది. ఎలాంటి నోటీసులు లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలోకి పోలీసులు చొరబడి వేధింపులకు పాల్పడడంపై అన్నీ వర్గాల ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పరిస్థితులపై నెహ్రూ యువకేంద్రం రిటైర్డ్ జాయింట్ డైరక్టర్ నాగిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన అభిప్రాయాలను ×సాక్షి≢తో పంచుకున్నారు. ప్రస్తుత పాలకులకు రాజనీతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కక్ష సాధింపు చర్యలకు చివరికి పోలీసులు బలిపీఠం ఎక్కాల్సి వస్తుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

- సోషల్ మీడియాలో వచ్చే అశ్లీల వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది ప్రభుత్వం బాధ్యత కూడా. అలాగని ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించే ప్రజా సంఘాల నాయకులను, మేధావులను వేధించడం సరైన చర్య కాదు.
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా అణచివేతకు పాల్పడితే సమస్యలు పరిష్కారం కావు. ప్రజల నుంచి వచ్చే సద్విమర్శలను స్వాగతించినప్పుడే మంచి పరిపాలన అందించడం సాధ్యమవుతుంది.
- సమాజంలోని మేధావులు, ప్రజా సంఘాల నాయకులే కాకుండా వివిధ వర్గాల ప్రజలు, ప్రతిపక్షాలు, సొంత పార్టీ కార్యకర్తలు కూడా స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుంది.
- నిర్దోషులను భయభ్రాంతులకు గురి చేయడం ద్వారా సమాజాన్ని అభద్రతలోకి నెట్టివేయడమే. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉంది.
- ఒక పత్రిక ఎడిటర్‌గా సమాజంలోని ప్రజలు అనుభవిస్తున్న బాధలు, వ్యథలపై వివిధ కోణాల్లో కథనాలు ఇవ్వాల్సి వస్తుంది. అందులో ఏవైనా అభ్యంతరకర అంశాలు ఉంటే ఖండించవచ్చు. అందుకు భిన్నంగా వేధింపులకు దిగడం మంచిదికాదు. ఇది సమాజానికి హాని చేస్తుంది.
- సాక్షి పత్రిక ఎడిటర్ మీద దాడి దిగ్భ్రాంతికరమైన విషయం. గొంతుల్లేని సమాజాన్ని చూడాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుంది.
- ఇవ్వాళ ఒక పత్రిక మీద దాడి జరిగితే రేపు మరో పత్రిక మీద దాడి జరగదని గ్యారంటీ లేదు.
- పోలీసు వ్యవస్థ ప్రతిదాంట్లో చొరబడడం, పరిధులు దాటి ప్రవర్తించడం మంచిది కాదు. ఇది సమాజానికి చెడు సంకేతాలను ఇస్తుందనడంలో సందేహం లేదు.
- పోలీసుల తీరు వ్యవస్థపై నమ్మకం కోల్పోయేలా ఉంది. ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదు.
- పాలకులు మొత్తం పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం అభ్యంతరకరం. చివరికి దీనికి బలిపశువుగా మారేది పోలీసులలేనన్న ఆందోళన కలిగిస్తుంది.
- ఉన్నతాధికారుల మీద రాజకీయపార్టీల ముద్రలు వేయడం సరికాదు. ప్రభుత్వ పాలసీని అమలు చేసేది అధికారులే. దాన్ని తప్పు పట్టడం, అధికారులపై కేసులు పెట్టి వేధించడం పరిపాలనపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనడంలో సందేహం లేదు.
- రాజధాని నిర్మాణం అవసరమే. అయితే రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలన్నీ సమానంగా అభివృద్ధి చెందేలా చూడాల్సిన అవసరం ఉంది. అన్నీ ప్రాంతాలను సమాన దృష్టితో చూడడం పాలకుల తక్షణ కర్తవ్యం.

## గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్



అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**వీసీపల్లి:** తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లా వాజేడు మండలం పెద్దగుట్ట వద్ద జరిపిన కూబింగ్‌లో మావోయిస్టుల దాడికి బలైన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ (తెలంగాణ) నూకతోటి పవన్ కల్యాణ్ (22) స్వగ్రామం మండలంలోని కొత్తమద్దిపాడు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం స్వగ్రామం తీసుకొచ్చి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ కానిస్టేబుల్ భౌతిక కాయానికి దండేసి నివాళులర్పించారు. పవన్ కుమార్ కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొర్రారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఒకే రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పోలు జయరాంరెడ్డి, జెడ్పీటీసీ మదతల కస్తూరి రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, సైకం ఏడుకొండలు రెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, యేరువ నరసింహా చౌదరి, ఎంపీటీసీ భాస్కర్, నడికట్టు వెంకటరెడ్డి, నాగిరెడ్డి నరసింహారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, మోహన్ రెడ్డి, కోటిరెడ్డి, సాల్మన్, ఇజ్రాయేల్, ఆదాము, చిన్నా, నరాల కొండారెడ్డి, ఓబులు రెడ్డి, శీలం సుదర్శన్, రమేష్ గౌడ్, కొండ్రు నరసింహ, మూలే గోవింద్ రెడ్డి, మూలే మాలకొండారెడ్డి, మాల్యాద్రి తదితరులు నివాళులర్పించారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి కూడా కానిస్టేబుల్ భౌతికకాయానికి నివాళులర్పించారు. పవన్ కుమార్ కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు.

భారీ స్థాయిలో ప్రజలు వెంటరాగా అమర్ రహే వీర జవాన్, భారత్ మాతాకీ జై అంటూ నినదిస్తూ అధికార లాంఛనాలతో పవన్ కుమార్ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ ఖాజావలి, పామూరు సీఐ భీమ్ నాయక్, పలువురు సిబ్బంది పవన్ కుమార్ భౌతికకాయాన్ని మోశారు.

NARAYANA SCHOOLS
WALK-IN INTERVIEW
For the Following Positions @ ONGOLE
PRINCIPAL
P.G. with B.Ed., min. 5 yrs. of exp. in CBSE or State Board Schools
VICE - PRINCIPAL
P.G./Graduate with B.Ed., min. 3 yrs. of exp. in Teaching cum Administration
ACADEMIC DEAN
Maths, Physics, Chemistry, Biology PG/Graduate, B.Ed. with Min. 2+ years of experience in Teaching cum Administration
HIGH SCHOOL TEACHERS
Maths, Biology, Physics, Chemistry, English, Telugu, Hindi & Social Studies PG/Graduate, B.Ed with Min. 2+ years of experience
PRIMARY TEACHERS (Female)
P.G. / Graduate, B.Ed. / D.Ed., with min. 2+ years of experience
PRE-PRIMARY TEACHERS (Female)
Graduate with Dip., in ECCE/NTT MTT/PPTT/D.Ed with 1+ yrs. of exp.
CO-ORDINATORS (HSC/PRIMARY/PP) - PG/Graduate, B.Ed.
Willing to travel, having 2+ yrs. of exp. in Teaching cum Administration
High School: Maths, Chemistry, Physics, Biology
Primary: Maths, English, Social, Science
Pre-Primary: Relevant experience
SOFT SKILLS TRAINER
P.G. / Graduate in English with relevant experience
ACTIVITY TEACHERS
Computer, Yoga, Karate, Dance, Music, Art & Craft, PET, Calligraphy 1+ years of experience in Teaching
Librarian, DTP Operators, Wardens, Receptionist, Board Clerk with minimum 2 years of relevant experience
SALARY NEGOTIABLE
INTERVIEW PROCESS: WRITTEN TEST, DEMO CLASS, VIVA.
SCAN TO APPLY
Walk-in interview on 10th, 11th, 17th & 18th May 2025 From 9:30 a.m. to 5:30 p.m.
ONGOLE: Narayana CO & Olympiad School, Mangamur Road, Opp. MAX Show Room, Ongole-01, Ph: 8179880210/344/236, 7337336241, 7337056458, 9030370183

## క్లుప్తంగా

### భర్త హత్య కేసులో భార్య అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

కంభం: మద్యానికి బానిసై తరచూ వేధిస్తున్న భర్తను అతని భార్యే హతమార్చిందని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీ రాత్రి స్థానిక కాపవీధిలో షేక్.వలి(37) హత్యకు గురయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు భార్యను నిందితురాలిగా తేల్చారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హత్య కేసు పూర్వాపరాలను డీఎస్పీ వెల్లడించారు. అర్ధవీడుకు చెందిన షేక్ వలితో కంభం పంచాయతీ పరిధిలోని సాధుమియా వీధికి చెందిన రిజ్వానాకు వివాహమైంది. భార్యతో కలసి గత కొంతకాలంగా కంభంలోని కాపవీధిలో నివాసం ఉంటున్నాడు. వలి పెయింటింగ్ పనులకు, రిజ్వానా స్వీట్ షాపులో పనికి వెళ్లేవారు. మద్యానికి బానిసైన వలి భార్యపై అనుమానం పెంచుకొని తరుచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో మద్యం మత్తులో గొడవ పడుతున్న భర్త మెడకు కండువా బిగించడంతో మరణించాడు. వలి మృతదేహాన్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు ఆమె ప్రయత్నించింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కె.మల్లికార్జున, ఎస్సై నరసింహారావు దర్యాప్తు చేపట్టారు. భార్య రిజ్వానాను నిందితురాలిగా గర్తించి ఈనెల 8వ తేదీన తురిమెళ్ల రోడ్డులోని గచ్చుకాలువ వీధి వద్ద అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్యకేసును త్వరితగతిన ఛేదించిన సీఐ, ఎస్సైని డీఎస్పీ అభినందించారు.

# దిగిరాని సర్కారు.. మాత్రలిచ్చే దిక్కులేరు!

- గత 11 రోజులుగా సీహెచ్ఓల సమ్మెబాట
- గ్రామీణ ప్రాంతాల్లో మూతపడిన విలేజ్ క్లినిక్‌లు
- తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, పేదలు
- సమ్మెను సాకుగా చూపి వేతనం నిలిపేశారని సీహెచ్ఓల ఆవేదన
- ఒంగోలు కలెక్టరేట్ ఎదుట వినూత్న రీతిలో సీహెచ్ఓల నిరసన


వినూత్నరీతిలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర సన తెలుపుతున్న సీహెచ్ఓలు (ఫైల్)

కంభం:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాక ముందే ప్రజలతో పాటు ఉద్యోగులు సైతం రోడ్డెక్కుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. చిరుద్యోగులు తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితిలో సమ్మెబాట పడుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించడంలో కీలకంగా వ్యవహరించే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్ఓ) సమ్మె సైరస్ మోగించినా సర్కారు పెడచెవిన పెట్టింది. దీంతో జిల్లా వ్యాప్తంగా విలేజ్ క్లినిక్‌లలో పనిచేస్తున్న 500 మందికి పైగా సీహెచ్ఓలు గత 11 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రమైన ఒంగోలులో వినూత్న రీతిలో నిరసనలు తెలియజేస్తున్నారు. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆదేమీ చేయకపోగా సమ్మెను సాకుగా చూపి సీహెచ్ఓలకు ఏప్రిల్ నెల వేతనం నిలిపేసింది. ప్రభుత్వ తీరుపై ఇప్పటికే నిరసన గళం వినిపిస్తున్న సీహెచ్ఓలు డిమాండ్ల సాధన కోసం స్వరం పెంచారు.

**సమ్మెతో రోగుల ఇక్కట్లు**

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సేవలపై సీహెచ్ఓల సమ్మె తీవ్ర ప్రభావం చూపుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, మహిళలు వైద్య సేవలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న రోగాలకు రోజూ గ్రామ స్థాయిలోనే వైద్యసేవలు, ఉచితంగా మందులు లభించేవని, ఉద్యోగుల సమ్మెతో పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వృద్ధులు వైద్యం కోసం సుమారు 10 కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సిన దుస్థితి. ఏఎన్ఎంల ద్వారా రోగులకు సేవలందిస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నప్పటికీ వారికి వ్యాక్సిన్, ఇతర సర్వేల కార్యక్రమాలు ఎక్కువగా ఉండటంతో విలేజ్ క్లినిక్‌లలో అందుబాటులో ఉండటం లేదు. నిరవధిక సమ్మె చేస్తున్న వైద్యసిబ్బంది డిమాడ్లను పరిష్కరించి గ్రామ స్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**వేతనం నిలిపివేత అన్యాయం**

ప్రతి నెల 5వ తేదీలోగా సీహెచ్ఓల బ్యాంకు ఖాతాల్లో జమయ్యే వేతనం 9వ తేదీ వరకు కూడా పడలేదు. సమ్మెను బూచిగా చూపి రాష్ట్ర ప్రభుత్వం వేతనం నిలిపేయడం అన్యాయమని సీహెచ్ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి, ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు సీహెచ్ఓలు పేర్కొన్నారు.


మూతపడిన రావిపాడు విలేజ్ క్లినిక్

**సీహెచ్ఓల డిమాండ్లు ఇవీ..**

- ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్ఓలను రెగ్యులర్ చేయాలి.
- ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలి.
- హైక్‌ను వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్ ఇన్సెంటివ్‌లు విడుదల చేయాలి.
- ఈపీఎఫ్ బెనిఫిట్‌ను పునరుద్ధరించాలి.
- ఎక్స్‌గ్రేషియా పాలసీ అమలు చేయాలి.
- నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అమలు చేయాలి.

**న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి**



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా సీహెచ్ఓలకు వేతనం, ఇతర బెనిఫిట్లు ఇవ్వాలి. అద్దె బకాయిలు, కరెంటు బిల్లులు వెంటనే చెల్లించాలి. ఏడాది నుంచి నిలిపివేసిన ఈపీఎఫ్ పునఃప్రారంభించాలి. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్ల సర్వీసు పూర్తయిన సీహెచ్ఓలను రెగ్యులర్ చేసి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

– గంటా ప్రసన్న, సీహెచ్ఓ, ఏపీఎంసీఏ సెక్రటరీ

**ఆస్పత్రికి వెళ్లాలంటే 5 కి.మీ ప్రయాణించాలి**



ఆరోగ్యం బాగ లేనప్పుడు మా ఊరిలో ఉన్న ఆస్పత్రికి వెళ్తే అక్కడ పరీక్షించి మందులు ఇచ్చేవారు. సమ్మె కారణంగా కొన్ని రోజుల నుంచి విలేజ్ క్లినిక్‌లు తెరుచుకోవడం లేదు. ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కంభంలో చూపించుకోవాల్సి వస్తోంది.

– కాటంరెడ్డి బాలమ్మ, రావిపాడు

**ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి**



సీహెచ్ఓలు సమ్మెలో ఉండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యసేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలి.

– మహమ్మద్ ఇబ్రహీం, కంభం

## ఎమ్మెల్యే పుట్టిన రోజు చేయడమే నేరమట!

- వైఎస్సార్ సీపీ నాయకుడిపై కూటమి నేతల వేధింపులు


కిలారి వెంకట్రావు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి నాయకుల కక్ష సాధింపులు మితిమీరుతున్నాయి. ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించిన వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని పోలీసులతో వేధింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ముండ్లమూరు మండలంలోని బసవాపురంలో ఎమ్మెల్యే బూచేపల్లి జన్మదిన వేడుకలను గ్రామానికి చెందిన కిలారి వెంకట్రావు నిర్వహించారు. ఇది ఆ గ్రామ టీడీపీ నాయకులకు కంటగింపుగా మారడంతో కేసుల కుట్రకు తెరదీశారు. కూటమి ప్రభుత్వం లో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఈ సంఘటన రుజువు చేస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిలారి వెంకట్రావు 2022లో 16 సెంట్ల స్థలం కొనుగోలు చేయగా ఈ విషయంలో గ్రామానికి చెందిన మాలెపాటి గాలెయ్య, బాబు నాయక్ ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. దీంతో అప్పటి ఒంగోలు డీఎస్పీ విచారణ చేపట్టి తప్పుడు కేసుగా నిర్ధారించారు. ఈ క్రమంలో సదరు స్థలానికి వెంకట్రావు ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామానికి చెందిన మోతుకూరి గురవయ్య, మాలెపాటి గాలెయ్య, భవనాసి ప్రభుదాసు, బొల్లేపల్లి వెంకటేశ్వర్లు, సందాడి గోవిందు పోలీసులతో ఫోన్ చేయించి వేధిస్తున్నారని వెంకట్రావు సాక్షి టాస్క్‌ఫోర్స్ ఎదుట వాపోయారు. తనపై హత్యాయత్నం కేసు మోపుతామని తరచూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మితో పోలీసులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నారని, తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని చెప్పారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించిన ఏపీటీఎఫ్ నాయకులు


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనార్దనరెడ్డి

ఒంగోలు సిటీ: ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు 1–5 తరగతులు, ప్రాథమికోన్నత పాఠశాలలు 1–7 తరగతులు, ఉన్నత పాఠశాలలు 6–10 తరగతులు మాత్రమే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పత్రికా సంపాదకుడు ఎస్.గురునాథశర్మ మాట్లాడుతూ 117 జీవో రద్దు, పెండింగ్‌లో ఉన్న 3 డీఏలతో పాటు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పూర్వరాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు కొన్నేళ్లుగా సమస్యలు పరిష్కారం కాక తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడిచినా విద్యారంగంలో ఎటువంటి సాకారాత్మక నిర్ణయాలు తీసుకోలేదని, విద్యారంగాన్ని మరింత సంక్షోభంలోకి నడిపిస్తోందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.సుబ్బారావు యూనియన్ నాయకులకి మద్దతుగా వచ్చి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖకు రూ.12 వేల విలువైన మైకుసెట్‌ను రిటైర్డు ఉపాధ్యాయులు ఎం.వి.కృష్ణ, గురుప్రసాద్ అందజేశారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు ఏఓ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఈ.శ్రీనివాసులు, జేఏసీ ప్రకాశం జిల్లా శాఖ చైర్మన్ శరత్‌బాబు, జేఏసీ సెక్రటరీ జనరల్ కృష్ణారెడ్డి, జిల్లా సబ్ కమిటీ సభ్యులు కె.తిరుమల, టి.సుబ్బారాయుడు, నాయబ్‌రసూల్, పి.హనుమంతరావు, శేషారావు, శివరామకృష్ణ, ఎ.ప్రసాద్, ఆనందరావు, మల్లిఖార్జునరావు, రాష్ట్ర కౌన్సిలర్లు రాజకుమార్, శ్రీనివాసరావు, బషీరున్నీసా, రవి, ఖాదర్‌బాషా, యోహాన్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి, మూర్తయ్య, తలారి సుబ్బారావు, పి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## 'సిందూర్'కు మద్దతుగా ఎన్‌సీసీ క్యాడెట్ల కవాతు



గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

గిద్దలూరు రూరల్: పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్న ఉగ్రమూకల పీచమణచేందుకు భారత్ తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా గిద్దలూరు పట్టణంలో ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ జెండాలు చేతబూని కవాతు చేశారు. స్థానిక జీవనజ్యోతి జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు శుక్రవారం పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్, వైఎస్సార్ సెంటర్ తోపాటు పలు వీధుల్లో ర్యాలీగా ముందుకు సాగారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు నిరంజన్ పాల్గొన్నారు.


మడియాలస్వామి సన్నిధిలో రజక సంఘ నాయకుల పూజలు

**ఆలయాల్లో పూజలు**

దేశం కోసం ప్రాణాలొడ్డి పోరాడుతున్న సైనికుల సంక్షేమం కోరుతూ పట్టణంలోని వీరన్నబావి సమీపంలో ఉన్న కాళికాంబ ఆలయంలో బీజేపీ నాయకులు శుక్రవారం పూజలు చేశారు. ప్రజలంతా సైనికులకు మద్దతుగా నిలవాలని బీజేపీ నేత పిడతల రమేష్‌రెడ్డి కోరారు. కొంగలవీడు రోడ్డులోని మడియాలస్వామి ఆలయంలో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, సంఘ నాయకులు తదితరులు పూజలు చేశారు.

## గోవా అక్రమ మద్యం సరఫరాదారు అరెస్ట్

- ముంబైలో అదుపులోకి తీసుకున్న కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి
- 14 రోజుల రిమాండ్ విధించిన గిద్దలూరు కోర్టు


నిందితుడితో కంభం ఎక్సైజ్ అధికారులు

కంభం: ముంబైలో ఉంటూ గోవా మద్యాన్ని సరఫరా చేస్తున్న నిందితుడిని కంభం, గిద్దలూరు ఎక్సైజ్ పోలీసుల బృందం కటకటాల్లోకి నెట్టింది. వివరాలు.. గత నెల 5వ తేదీన కంభం మండలంలోని చిన్నకంభంలో గోవా మద్యాన్ని కంభం ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. గోవా మద్యం సరఫరాదారు ముంబైలో ఉంటున్నట్లు దర్యాప్తులో తేలడంతో కంభం ఎక్సైజ్ సీఐ ఎస్.కొండారెడ్డి, గిద్దలూరు ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు తమ సిబ్బందితో కలిసి బృందంగా ఏర్పడి ఈనెల 5వ తేదీన వెళ్లారు. ముంబైలోని చార్కోప్ పోలీసుల సహకారంతో నిందితుడు దేవేంద్రన్ వీరప్పన్ శెట్టిని ఈ నెల 7వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ముంబైలోని బోరివలి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి వారి అనుమతితో కంభం తీసుకొచ్చారు. శుక్రవారం గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ముంబై వెళ్లిన బృందంలో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు షేక్ షంషీర్, షేక్ రహ్మతుల్లా, పి.శ్రీనివాసులు ఉన్నారు.

# దూసుకొచ్చిన మృత్యువు


కొన ఊపిరితో ఉన్న కానిస్టేబుల్‌ను అంబులెన్సులో ఎక్కిస్తున్న ఎస్సై అజయ్‌బాబు


మృతుడు వెంకట రామిరెడ్డి(ఫైల్)

- టిప్పర్ ఢీకొని ఎక్సైజ్ కానిస్టేబుల్ దుర్మరణం
- భీతావహంగా సంఘటనా స్థలం
- కార్యాలయ పనిపై చీమకుర్తి నుంచి ఒంగోలు వెళ్తుండగా దుర్ఘటన

సంతనూతలపాడు: టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. స్పీడ్ బ్రేకర్ వద్ద స్లో అయిన బైక్‌ను వెనుక నుంచి అతి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ దుర్మరణం చెందారు. కింద పడిపోయిన కానిస్టేబుల్ మీదుగా లారీ దూసుకెళ్లడంతో శరీరం ఛిద్రమై సంఘటనా స్థలం భీతావహంగా మారింది. సంతనూతలపాడులోని మైనంపాడు డొంక వద్ద గురువారం ఉదయం 10.20 గంటలకు సంభవించిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఎస్సై అజయ్ కుమార్ కథనం మేరకు.. రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన పోతిరెడ్డి వెంకట రామిరెడ్డి(51) పేర్నమిట్టలోని టుబాకో బోర్డు సమీపంలో నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం చీమకుర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో భాగంగా శుక్రవారం ఉదయం చీమకుర్తి నుంచి ఒంగోలుకు బైక్‌పై బయలుదేరిన ఆయనను మృత్యువు వెంటాడింది. సంతనూతలపాడు చెరువు సమీపంలోని మైనంపాడు డొంక వద్ద స్పీడ్ బ్రేకర్ ఉండటంతో బైక్‌ను స్లో చేయగా వెనుకనే వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. టిప్పర్ టైర్ల కింద కానిస్టేబుల్ శరీరం ఛిద్రమైంది. ప్రమాద విషయం తెలియగానే ఎస్సై అజయ్ బాబు హుటాహుటిన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కానిస్టేబుల్‌ను అంబులెన్సులో ఎక్కించడానికి ఎవరూ సాహసించకపోవడంతో ఎస్సైతో పాటు హోంగార్డు నాయక్ ముందుకొచ్చారు. జీజీహెచ్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలోనే కానిస్టేబుల్ వెంకట రామిరెడ్డి కన్నుమూశారు. ప్రమాదం కారణంగా హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కాగా మృతి చెందిన కానిస్టేబుల్ రామిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె డిగ్రీ, రెండో కుమార్తె ఇంటర్ పూర్తి చేశారు. ఉదయం ఇంటి నుంచి సంతోషంగా విధులకు వెళ్లిన రామిరెడ్డి అంతలోనే విగతజీవిగా మారడంతో భార్య, కుమార్తెలు గుండెలవిసేలా రోదించారు.

## తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్


సమీక్షలో కలెక్టర్, డ్వామా పీడీ, జెడ్పీ సీఈఓ

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో సమావేశమయ్యారు. వేసవిలో తాగునీటి సరఫరాపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ నుంచి తాగునీటి అవసరాల కోసం సాగర్ నీటిని విడుదల చేస్తున్నందున చెరువులను పూర్తి స్థాయిలో నింపాలని చెప్పారు.

**ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్**

ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్నారులను ప్రత్యేక శిబిరాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేని చిన్నారులను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు.

**లేబర్ మొబలైజేషన్లో వెనుకబాటు**

లేబర్ మొబిలైజేషన్‌లో జిల్లాలోని కొన్ని మండలాలు వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, డ్వామా అధికారులతో సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. కొనకనమిట్ల, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, వెలిగండ్ల మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయన్నారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, డీపీఓ వెంకట నాయుడు, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్తుల సమష్టి కృషితో ఐపీఎస్ కల సాకారం

- ఐపీఎస్ ములగాని ఉదయ్ కృష్ణా రెడ్డి


ఉదయ్ కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

సింగరాయకొండ: గ్రామస్తుల సమష్టి కృషితోనే ఐపీఎస్ సాధించానని ఇందులో తన కృషి, పట్టుదల, ప్రతిభతో పాటు చిన్నతనం నుంచి గ్రామస్తులు అందించిన సహాయ సహకారాలు ఎక్కువ ఉన్నాయని మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఉల్లపాలెం గ్రామం సెంటర్‌లో శుక్రవారం రాత్రి ఉదయ్ కృష్ణారెడ్డికి పౌర సన్మానం నిర్వహించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన చిన్నతనం నుంచి వివిధ సందర్భాల్లో తనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా గ్రామస్తుల అందించిన సహకారాన్ని పేరు పేరునా తెలియజేస్తూ వారికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్నతనంలో విద్యనేర్పిన ఉపాధ్యాయులను, ఆరేళ్ల వయసులో న్యుమోనియా వ్యాధితో ప్రాణాపాయమైన స్థితిలో ఉన్న తనకు చికిత్స చేసిన వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ ఫోరం, డాక్టర్ అశోక్ కుమార్ రెడ్డిని శాలువాతో సత్కరించారు. తరువాత గ్రామ సర్పంచ్ పాకనాటి అనసూయమ్మ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు ఉదయ్ కృష్ణారెడ్డిని పార్టీలకతీతంగా సత్కరించారు. అంతకు ముందు సింగరాయకొండలో ఉదయ్ కృష్ణారెడ్డిని ర్యాలీగా తీసుకొచ్చారు. కందుకూరు రోడ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ స్టేషన్ సెంటర్‌కు రాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలకు, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత కందుకూరు రోడ్ సెంటర్ మీదగా ఉళ్లపాలెం వరకు ర్యాలీగా వెళ్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉదయ్ కృష్ణారెడ్డికి అపూర్వ స్వాగతం పలికారు. గ్రామ నాయకులు పులగర నారాయణరావు, వైఎస్ఆర్ సీపీ నాయకులు పాకనాటి సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కాళహస్తి వెంకరెడ్డి, మాజీ ఎంపీటీసీ బిళ్ల కోటేశ్వరరావు, కుర్రి నరసింహారావు, ఆరవ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజంపై రెడ్‌బుక్ రాజ్యాంగమా?

- దర్శిలో పాత్రికేయుల నిరసన


తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

దర్శి(కురిచేడు): జర్నలిజంపై రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రయోగించాలని చూడటం కూటమి ప్రభుత్వ అవివేకమని, పత్రికా రంగంపై రాజకీయ కక్ష సాధింపులతో సర్కారు స్వీయ పతనానికి నాంది పలికిందని ఏపీయూడబ్ల్యూజే నాయకుడు మేడగం రామాంజనేయరెడ్డి విమర్శించారు. గురువారం విజయవాడలో సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలోకి సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు ప్రవేశించి సోదాలు చేయడాన్ని ఖండించారు. శుక్రవారం దర్శిలో నియోజకవర్గానికి చెందిన పలువురు పాత్రికేయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు రాష్ట్రంలో పాలన సాగించినా జర్నలిజంపై ఈ స్థాయిలో దాడికి పాల్పడలేదన్నారు. అక్షరంపై కక్ష సాధింపులు ఆపి, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.


సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ 5సం॥ల పెరిగిన శ్రీగంధ ఎర్రచందనం వనం లో 12 1/2 గదులు లక్ష అరవై వేలకే మా వనం చూసిన తరువాత నిర్ణయం తీసుకోండి. 9908822077 [SCA25003425]

■ 5,99,999/-కే 22సెంట్లు అద్దంకి దగ్గర ముండ్లమూరులో 96 ఎర్రచందనం మొక్కలు పూర్తి డెవలప్మెంట్స్ స్పాట్ రిజిస్ట్రేషన్ : ✆ 8008153209 [SCA25003456]

Wanted

■ ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ JLS కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ 63995 52222, 87126 95615. [OA-414]

■ ఒంగోలులోని ప్రముఖ DJమ్యాన్ పవర్ సర్వీసెస్ సంస్థకు సెక్యూరిటీ, వార్డుబాయ్స్, హౌస్‌కీపింగ్ వర్కర్స్, ఆఫీస్ సిస్టం లేడీ ఆపరేటర్ కావలెను . సెల్:9381454938, 8333960938, 9392161780 [SCA25003276]

■ ఒంగోలులోని రాంనగర్ 8వ లైన్లో విక్రమ్ హైస్కూల్ నందు నర్సరీ–10వ తరగతి వరకు బోధించుటకు అర్హతగల టీచర్స్ కావలెను. సంప్ర: 9848391021, 9966912666 [SCA25003377]

■ ఆఫీసు నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. వర్క్: 9am–5.30pm, జీతం: 8000–9000. సంప్ర॥ 6281582091, 7093673490 [SCA25003401]

■ సింగరాయ కొండలో ప్రముఖ కంపెనీకు సెక్యూరిటీ ఆఫీసర్ (so), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను ✆ 92980 11777, 81427 61777 [SCA25003383]

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్, బ్యాచ్ ఇన్‌ఛార్జీస్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతం: 12వేలు నుండి 21వేలు వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు: 21సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు ఉండవలెను. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8008556069 [G-5997]

■ Wanted Teachers to Teach 1 to 10th Class for All Subjects & PET. SRI RAM OLYMPIAD School, Kurnool Road, Ongole. ✆ 98491 07773. [SCA25003187]

■ SRI SARADHA NIKETAN Public School MARTUR, BAPATLA District Wanted jobs : Maths, Physics, Chemistry. Qualification: M.sc, B.Ed (Exp :5-10 Yrs with JEE-MAINS, NEET) Data Entry Operators-2 Accountancy B.S-1 M.COM /MBA Ph no: 7095723036, 9398832060 [SCA25003368]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02762